వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 165 శుక్రవారం | 29 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


## టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ

అభినందించిన జిల్లా పాత్రికేయులు



8లో..




# ఆటోలు షెడ్డుకు.. డ్రైవర్లు కూలికి

వివరాలు 2లో..

**'మహాలక్ష్మి'తో జీవనోపాధి కరువు**

- ఉపాధి లేక రోడ్డెక్కుతున్న కార్మికులు
- వరంగల్ బస్ స్టేషన్ ముట్టడి
- ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే అంటూ హెచ్చరిక

అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆటో డ్రైవర్లకు 'మహాలక్ష్మి' పథకం కోలుకోలేని షాక్ ఇస్తోంది. ఆటోలు షెడ్డుకు.. డ్రైవర్లు కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం ద్వారా మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 56వేల మంది ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కరువై రోడ్డుపాలవుతున్నారు. పట్టాలు చేతపట్టుకున్నా ప్రభుత్వం ఉద్యోగం లభించక స్వయం ఉపాధినే జీవనోపాధిగా ఎంచుకుని ఆటో డ్రైవర్లుగా మారితే ఈ ప్రభుత్వం నిండా ముంచుతోందంటూ మధనపడుతున్నారు. గిరాకీ లేక అనేక ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లు ఆందోళనకు దిగుతున్నారు. ఆటో డ్రైవర్ల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ బస్టాండ్‌ను ముట్టడించారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే అంటూ హెచ్చరించారు. - వరంగల్ వాయిస్, వరంగల్




8లో

## చిరుధాన్యాలతో ఆరోగ్య వంటకాలు

- రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్
- పిండి వంటల తయారీలోను ఉచిత శిక్షణ

## ప్రతిష్ఠాత్మకంగా ప్రజా పాలన

- అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి వాకాటి కరుణ
- పలు ప్రజా పాలన కౌంటర్ల సందర్శన



2లో..

# ఆటోలు షెడ్డుకు.. డ్రైవర్లు కూలికి



**'మహాలక్ష్మి'తో జీవనోపాధి కరువు**

**ఉపాధి లేక రోడ్డెక్కుతున్న కార్మికులు**

**వరంగల్ బస్ స్టేషన్ ముట్టడి**

**ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే అంటూ హెచ్చరిక**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆటో డ్రైవర్లకు మూలిగే నక్క మీద తాటి పండు పడినట్టు 'మహాలక్ష్మి' పథకం వారి పాలిట భారంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో గిరాకీ లేక అనేక ప్రాంతాలలో ఆటోడ్రైవర్లు ఆందోళనకు దిగుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే భేదం లేకుండా ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కరువైంది. బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళ సాధికారత, అభివృద్ధికి ఉపయోగపడుతుందనేది వాస్తవమే అయినప్పటికీ ఆటో డ్రైవర్లు మాత్రం ఈ పథకం కారణంగా కష్టాలను ఎదుర్కొంటున్నారు. బతుకుతెరువు ఎలా ఉంటుందోనన్న భయాందోళనలకు గురవుతున్నారు. ఆటోలనే నమ్ముకొని రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వీరి సంఖ్య 56 వేలు, వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సీటీలలో 18వేల మంది జీవనోపాధి పొందుతున్నారు.

### బస్ స్టేషన్ ముట్టడి..

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ బస్ స్టేషన్ ను ముట్టడించారు. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ ఉచితం బస్ సౌకర్యంతో ఆటోలకు గిరాకి లేక వాటిని షెడ్డుకు తరలించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోల్లో ప్రయాణించే వారు లేక బతుకు తెరువు కష్టమై కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆత్మహత్యే దిక్కంటూ హెచ్చరించారు. డీజిల్, ఇతర ఖర్చుల పోగా ఒక్కో ఆటో డ్రైవర్ కు రోజు కూలి వంద రూపాయలు గిట్టడంలేదని ఆశేదన వ్యక్తం చేశారు. ఒక్కో రోజు జేబులోనుంచే ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో పూట గడవడమే కష్టంగా మారిందని, ఆటో ఫైనాన్స్ కట్టలేక, పిల్లల చదువుల ఫీజులు చెల్లించలేక, రోజువారి ఫైనాన్స్ లకు పైస లేక ఆటో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయన్నారు.



### నెలకు రూ.15వేల భృతి చెల్లించాలి..

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఆటో డ్రైవర్ కు ప్రతి నెల జీవన భృతి కింద నెలకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించాలని, త్వరితగతిన ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సాధారణ మరనం పొందిన ఆటో డ్రైవర్ కు రూ.10లక్షల ఆర్థిక బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ సింగిల్ పర్మిట్ విధానం తీసుకురావడంతోపాటు ఆరోగ్య బీమా, వడ్డీలేని రుణాలు, కనీస వసతులతో ఆటోస్టాండ్లు ఏర్పాటు, పర్మిట్ల ప్రక్రియ సులభతరం చేసి సర్కారు ఆదుకుంటే లక్షల కుటుంబాలు ఊరట పొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు ఈసంపెల్లి సంజీవ, మంద శ్రీధర్ రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, బొల్లం సంజీవ, బొల్లా ఈశ్వర్, షైక్ అమీర్, కొర్లపాటి రమేష్, కోడూరి యాకుబ్, పసునూరి బాబు, విజయ్, సురేష్, సదానందం, శ్రీను, బాలరాజు, స్వామి, ప్రవీణ్, నరేష్, పూజారి రవి, సిరిసిల్ల రమేష్, వేల్పుల సతీష్, జయబాబు, రాజు, బండారు మార్కండేయ, శ్యాంసుందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కరకట్టలతో ముంపు రైతులను ఆదుకుంటాం

**ఎవరి మీద వ్యక్తిగత ద్వేషం లేదు**

**కాళేశ్వరం ప్రాజెక్టు సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు**



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** కరకట్టలు ఏర్పాటు చేసి ముంపు రైతులను ఆదుకుంటామని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతాన్ని శుక్రవారం మంత్రుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రులకు నీటిపారుదల శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతోపాటు అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్‌లో బుడగలు రావడంపై అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పనుల్లో ఏమి జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మేడిగడ్డకు రావడంలో ఓ ప్రత్యేకత ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మూడు బ్యారేజీలపై అనుమానాలు ఉన్నాయని, పిల్లర్లు కుంగిపోవడంపై డ్యాం సేఫ్టీ అధికారులు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంజనీర్లు, అధికారులపై మాకు ఎలాంటి ద్వేషం లేదన్నారు. అయితే రోజు ఏం జరిగిందో ప్రజలకు అధికారులు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నికల్ గా ఏం జరిగిందో ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, బీసీ సంక్షేయ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మకంగా ప్రజా పాలన

**అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి**

**ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి వాకాటి కరుణ**

**పలు ప్రజా పాలన కౌంటర్ల సందర్శన**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ, కమిషనర్, ప్రజా పాలన కార్యక్రమ ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి వాకాటి కరుణ అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని 7వ డివిజన్ పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ళ వేణుమాధవ్ ఆడిటోరియం, 14 వ డివిజన్ బాలాజీ నగర్, 15 వ డివిజన్ గొర్రెకుంటలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజా పాలన కౌంటర్ లను బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, అశ్విని తానాజి వాకడే, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లలతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వివరాలను ప్రజలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, మహేందర్ జీ, బల్దియా అదనపు కమిషనర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణ రెడ్డి హన్మకొండ మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీను, బల్దియా ఈ ఈ శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సారంగం, సంతోష్ బాబు, తహశీల్దార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళికి పూజలు..

చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని శుక్రవారం ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారి వాకాటి కరుణ సందర్శించారు. ఆలయ ఈఓ, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదం అందచేశారు.

## శ్రీ ఎల్లమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠాపన



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని కామారెడ్డిపల్లిలో శ్రీ ఎల్లమ్మ తల్లి విగ్రహా ప్రతిష్మాపన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ గౌడ కులస్తులకు, గ్రామ ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. కామారెడ్డి పల్లె ప్రజలకు తన సహా సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మిడి మహేందర్ రెడ్డి, కాస గాని రాజ్ కుమార్, ఎదునూరి లింగయ్య, తండా కుమార్, జన్ను లింగయ్య, మాజీ సర్పంచ్ చక్రపాణి, కాసగాని సాయి కుమార్, నూటెంకి కొమురయ్య, చిర్ర భూషలు, తడుక సురేష్, దానం ఓదెలు, కొయ్యల రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన స్వతంత్ర సమరయోధుడు, పత్తిపాక గ్రామ సర్పంచ్ చిట్టి రెడ్డి రాజిరెడ్డి మామ వైద్యుడు వీరారెడ్డి గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వీరారెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, నాయకులు గంట శ్యాంసుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆటో నగర్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గత కొన్ని సంవత్సరాలుగా అద్దె షాపులలో తమ బతుకు జీవన పోరాటం కొనసాగిస్తునామని, మానుకోటలో ఆటో నగర్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మహబూబాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళీనాయక్ కు జిల్లా వెల్డర్స్ అసోషియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలో పలు వార్డులలో ప్రజా పాలన కార్యక్రమ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మురళీనాయక్ ను జిల్లా వెల్డర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల కాలంగా తాము వెల్డింగ్ షాపులను రోడ్లకు ఇరువైపులా కొనసాగిస్తూ బతుకు పోరాటం చేస్తున్నామని, రోడ్ల వెడల్పు పేరుతో షాపులను తొలగించడంతో అద్దె ఇండ్లలో, అధిక కిరాయిలు కడుతూ ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మహబూబాబాద్ పట్టణంలో ఆటో నగర్ నిర్మాణం చేయాలంటూ పలుమార్లు అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించామని, కొంతమంది కాంగ్రెస్ నాయకుల సహకారంతో అధికారులు స్పందించి మున్సిపల్ శాఖ ద్వారా ఆటో నగర్ అభివృద్ధికి రూ.10లక్షల నిధులు కేటాయించినప్పటికి భూ సేకరణ జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ వినతులను పరిశీలించి ఆటో నగర్ నిర్మానానికి 15ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దుగ్గి నరేష్, ఉపాధ్యక్షుడు గండమాల గురువయ్య, యూనియన్ సభ్యులు దామోదర్, సిద్ధిక్, బహ్మచారి, యాకయ్య, వీరన్న, రవి, అబ్దుల్ పాషా పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రజాపాలన

**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం రేవంతరెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రజాపాలన సాగుతుందని పరకాల ఎమ్మెల్యే శ్రీ ప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమం భాగంగా రెండవ రోజు శుక్రవారం గీసుకొండ మండలం గొర్రెకుంట 15వ డివిజన్ లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బందులు గురవకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యేరేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు తీసుకోవడానికి ప్రజల వద్దకే వచ్చి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన నిదర్శనమని అన్నారు. పదేళ్ల గడీల పాలన అంతమై రాష్ట్రంలో ప్రజా పాలన ఆరంభమైందన్నారు. ప్రతీ వార్డు, గ్రామంలో 100మందికి కౌంటర్ ఏర్పాటుచేశారని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే సహకార సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తుందన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. అలాగే గీసుగొండ మండలం



బొడ్డు చింతలపల్లి గ్రామంలో శుక్రవారం సోమనాథ్ శాలివాహన పరస్పర సహాయక సహకార సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి పాత్రల ఉత్పత్తి కుటీర పరిశ్రమను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేరేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ చేతి వృత్తుల వారిని మొదటి నుంచి నేను గౌరవిస్తానని గతంలో నర్సంపేట శాసనసభ్యుడిగా ప్రోత్సహించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరిగిందన్నారు.

## స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని మాధారం కాలనీలో సీసీ రోడ్ల ఏర్పాట్లు పూర్తయి దాదాపు 6 నెలలు గడుస్తున్నా స్పీడ్ బ్రేకర్స్ వేయలేదు. కాలనీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, చిన్న పిల్లలు రోడ్లపై నడుస్తుంటారు. ఈ క క్రమంలో వాహనాలు వేగంగా రావడం, పెద్ద వాహనాల రాకపోకల వల్ల ఏర్పడే ప్రమాదాలను అధిగమించాలంటే కేవలం స్పీడ్ బ్రేకర్స్ వల్లనే సాధ్యమవుతుందని ప్రజలు కోరడంతో భీమ్ సేవా సంస్థ నాయకులు శుక్రవారం పరకాల మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామిని కలిసి స్పీడ్ బ్రేకర్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మాధారం భీమ్ సేవా సంస్థ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు గూడెల్లి నాగేంద్ర బాబు, స్వేరో నాయకులు మంద మనోజ్, కాంగ్రెస్ యూత్ నాయకులు దుప్పటి క్రాంతి, రాజ్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు గూడెల్లి శంకర్, సలహా దారులు నాగెల్లి సంతోష్, నాగెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ మోసాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, మామునూర్ :** ఆర్బీఐ అధికారులు నాలుగో బెటాలియన్ సిబ్బందికి బెటాలియన్ ఆవరణలో ఆన్ లైన్ బ్యాంకింగ్ మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్, లోన్ ఆప్స్, గూగుల్ రేటింగ్ స్కాం, ఫైనాన్సియల్ ఫ్రాడ్ కాల్స్ అనే బ్యాంకింగ్ మోసాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ డి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పెద్ద పెద్ద సెలబ్రిటీల నుంచి రోజు పని చేసుకునే దినసరి కూలి వరకు అందరూ ఆన్ లైన్ బ్యాంకింగ్ మోసాలకు గురవుతున్నారని, కాబట్టి ప్రతి ఒక సిబ్బంది ఆన్ లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులను కమాండెంట్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, వేణుగోపాల్ రెడ్డి, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు శోభన్, రమేష్, పురుషోత్తం రెడ్డి , దయశీల, చంద్రన్న, అశోక్, రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జగదీష్ ఇతర ఆర్బీఐ అధికారులు శివారెడ్డి, అరవింద్, హర్షవర్ధన్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది మొత్తం 340మంది హాజరయ్యారు.

# జిల్లా పోలీస్ వార్షిక నివేదిక-2023 విడుదల

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా పోలీస్ వార్షిక నివేదిక-2023ను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. 2023లో జిల్లాలో 10 హత్య కేసులు, 222 ఆస్తి సంబంధిత నేరాలు, 6 నేరపూరిత నర హత్యలు, 51 కిడ్నాప్ కేసులు, 44 రేప్ కేసులు, 474 గాయాలు కేసులు, 202 మోసపూరిత నేరాలు, 56 ఎస్సీ/ ఎస్టీ నేరాలు, 58 ఫోక్సో చట్టం కేసులు, 10 గంజాయి కేసులు, 51 సైబర్ నేరాలు, 117 మహిళల పై అఘాయిత్యాల కు సంబంధించిన కేసులు నమోదయ్యాయని తెలిపారు. కాగా గత ఏడాదిలో 27 హత్య కేసులు, 205 ఆస్తి సంబంధిత నేరాలు, 11 నేరపూరిత నరహత్యలు, 67 కిడ్నాప్ కేసులు, 52 రేప్ కేసులు, 472 గాయాలు కేసులు, 270 మోసపూరిత నేరాలు, 45 ఎస్సీ/ఎస్టీ నేరాలు, 64 ఫోక్సో చట్టం కేసులు, 11 గంజాయి కేసులు, 59 సైబర్ నేరాలు, 107 మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. గత సంవత్సరంతో పోల్చగా హత్య కేసులు 62.96శాతం తగ్గాయని, ఆస్తి సంబంధిత నేరాలు 8.29 పెరిగడం, నేరపూరిత నరహత్యలు 45.45 తగ్గాయని, కిడ్నాప్ కేసులు 23. 88 శాతం, రేప్ కేసులు 15.38 శాతం తగ్గాయని, గాయాలు కేసులు 0.42 పెరిగాయని, మోసపూరిత నేరాలు 25.18 తగ్గాయని, ఎస్సీ/ ఎస్టీ నేరాలు 24.44 పెరిగాయని, ఫోక్సో ఆక్ట్ కేసులు 9.37 శాతం తగ్గాయని, గంజాయి కేసులు 9.09 శాతం, సైబర్ నేరాలు 13.55 శాతం తగ్గాయని, మహిళలపై అఘాయిత్యాలు 9.34 శాతం పెరిగాయని తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా 2023లో 6205 మంది పాత నేరచరిత్ర గల వారిని బైండోవర్ చేయటం జరిగింది. పోలీస్ గ్రామ సందర్శన, పోలీస్ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, పోలీసు పెట్రోలింగ్ పెంచడం వల్ల కమ్యూనిటీ గ్రూపుల మధ్య గొడవలు గాని, మరేఇతర అల్లర్లు గాని జరగకుండా చేయగలిగామన్నారు. నిషేధిత మావోయిస్టు పార్టీ వారు వారి ఉనికిని చాటుకోవటం కోసం జిల్లాలోనికి



ప్రవేశి0చి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారనే సమాచారం ముందస్తుగా తెలుసుకొని స్పెషల్ పార్టీ పోలీసు బలగాలతో 2023లో కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించి, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్ 22 న గూడూరు మండలంలో మావోయిస్టు పార్టీకి కొరియర్స్ గా పని చేస్తున్న నలుగురు వ్యక్తులను ముందస్తు సమాచారం మేరకు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలు-2023ను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

### కేసుల దర్యాప్తు - విచారణ :

2023లో మొత్తం 1543 కేసులలో తుది తీర్పు వెలువడగా, అందులో 501 కేసులలో నేరనిరూపణ జరిగినధి. వీటిలో నేరస్థులకు ముఖ్యముగా రెండు (02) హత్య కేసులలో ఒకరికి మరణ శిక్ష, జీవిత ఖైధు శిక్ష, రెండు (02)రేప్ కేసులలో ఒకరికి జీవిత ఖైధు శిక్ష, మరొక కేసులో నేరస్థునికి 20ఏళ్ల జైలు శిక్ష, రెండు (02) కట్నం కోసం వేధించి చంపిన కేసులలో ఒక నేరస్థుడికి 17ఏళ్ల జైలు శిక్ష, ఇంకో నేరస్థుడికి 10 ఏళ్ల జైలు శిక్ష పడ్డాయి. మరో 586 కేసులు రాజీ కాబడినట్లు, మొత్తంగా ఈ ఏడాదిలో నేర నిరూపణ రేటు 32.47 శాతంగా నమోదైంది. దీన్ని మరింత పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

# చట్టబద్ధంగా మాత్రమే దత్తత తీసుకోవాలి

## జిల్లా జడ్జి పి.చంద్రశేఖర ప్రసాద్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డా:పరికపండ్ల అశోక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కోర్టులో కేంద్ర దత్తత నియమ నిబంధనల పై రూపొందించిన పోస్టర్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో దత్తత ప్రక్రియ జరుగుతుందని, ఆన్ లైన్ ద్వారా %ఝ్ఖీఖీ.ఖ్ఝ.స్త్రశీఙ.ఱఅ% వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. దత్తత పేరుతో పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రస్తుతం చట్టాలు సులభతరంగా మారాయని, క్రమ పద్ధతిలో దత్తత మార్గాన్ని సులభతరం చేసుకోవచ్చని, సంబంధిత అధికారులను సంప్రదించాలని, చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని, చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చినా, తీసుకున్న వారికి మూడు సంవత్సరాల కారాగార శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా పడుతుందని, ఏ ప్రయోజనం కోసమైనా ఒక బాలుడు కానీ, బాలికలను అమ్మటం కానీ కొనడం కాని జరిగితే వారికి ఐదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించబడుతుందని జిల్లా జడ్జి పి.చంద్ర శేఖర ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సి.సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.మౌనిక, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరేష్, చైల్డ్ లైన్ సూపర్ వైజర్ ప్రభు, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## కేయూ విద్యార్థి ఉద్యమ నాయకుల కేసుల వివరాలివ్వండి

### సీపీని కలిసిన విద్యార్థి ఉద్యమ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థి ఉద్యమకారుల కేసుల వివరాల కోసం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆఫీసులో కేయూ విద్యార్థి ఉద్యమ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసుల వివరాలను ఇవ్వాల్సిందిగా వినతి పత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఉద్యమ కాలంలో కాకతీయ యూనివర్సిటీ కేంద్రంగా పనిచేసిన విద్యార్థి ఉద్యమకారులపై నమోదైన కేసులో వివరాలు అందుబాటులో లేకుండా చాలామంది విద్యార్థి ఉద్యమకారులు ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి వివిధ ప్రభుత్వ పథకాలలో అవకాశాలు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, వివిధ పోలీస్ స్టేషన్ల లో పనిచేస్తున్న హౌస్ ఆఫీసర్లు కూడా విద్యార్థి ఉద్యమకారుల కేసుల వివరాలను అందించవలసిందిగా ఈ సందర్భంగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ నాయకులు డాక్టర్ సయ్యద్ వలీవుల్లా ఖాద్రి, డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ ఫిరోజ్ పాషా, జోరిక రమేష్ లు పాల్గొన్నారు.

## ఘనంగా ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికొట్ల రవి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికొట్ల రవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ మహ్మద్ తస్లీమా ఆధ్వర్యంలో శుక్రవారం అనాథ ఆశ్రమంలో పిల్లలకు బట్టల పంపిణీ, ఫ్రిజ్ పంపిణి చేసి పెద్దఎత్తున అన్నదానం చేశారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, దస్తావేజు లేఖరులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుభాష వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

### విప్, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్

### తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** తెలుగుభాష వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలని రాష్ట్ర విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా.జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ , చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా జనవరి 5,6,7 తేదీలలో జరిగే రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల గోడపత్రికను తెలంగాణ రాష్ట్ర విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా.రామచంద్రు నాయక్, కవి, ఉపాధ్యాయుడు మహమ్మద్ జహీరుద్దీన్, కవి, జర్నలిస్ట్ డి.లక్ష్మీ నారాయణల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లాకేంద్రం రాజమహేంద్ర వరంలోని గోదావరి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో ఈ మహాసభలు జరుగుతాయని జహీరుద్దీన్ తెలిపారు..ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెద్ద ఎత్తున అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారని, తెలుగు భాషలోని 25సాహితీ ప్రక్రియలపై మూడు రోజుల పాటు ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ నిర్వహణలో సాహితీ సదస్సులు జరుగుతాయన్నారు. సుమారు 70 దేశాల నుంచి ప్రతినిధులు, సాహితీ ప్రియులు పాల్గొంటారని, అయితే తెలుగు భాషాభిమానులందరూ పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని జహీరుద్దీన్, లక్ష్మీ నారాయణలు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రవీందర్, బాణాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్పూర్ దేవాలయం హుండీ ఆదాయం లెక్కింపు



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** శ్రీశ్రీ శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానం చిల్పూర్ స్వామి వారి హుండీలను శుక్రవారం లెక్కించారు. గత 4నెలల పదిహేను రోజులకుగాను హుండీ ఆదాయం రూ.9,33,053లుగా వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్లగొండ జిల్లా హుండీ పర్యవేక్షణ అధికారిణి బి.సుమతి, ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న, ముఖ్య అర్చకులు బి.రవీందర్ శర్మ, అర్చకులు, సౌమిత్రిశ్రీ రంగాచార్యులు ,కృష్ణమాచార్యులు, సేవాసమితి వారు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు .

## టీటీడీలో అఖండ హరినామ సంకీర్తన



**వరంగల్ వాయిస్, శాయంపేట:** హిందూ ధర్మ ప్రచార పరిషత్ తెలంగాణ రాష్ట్రం సారథ్యంతో శ్రీ రామదాసు భజన మండలి తెలంగాణ రాష్ట్రం అధ్యక్షుడు మాన్యపు సిద్ధేశ్వర స్వామి ఆశీస్సుతో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆదేశాల మేరకు శాయంపేట మండల కేంద్రంలోని శ్రీ రామదాసు భజన మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందాడి రాజు, శ్రీ రామదాసు భజన మండలి శాయంపేట మండల కార్యదర్శి శ్రీ తడక సదానందం గౌడ్ ఆధ్వర్యంలో శ్రీరామా ఆంజనేయ భజన మండలి పత్తిపాక భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా దాదాపు 16సార్లు అఖండ హరి నామ సంకీర్తన చేశారు. సీనియర్ భజన మండలి కాబట్టి, దాదాపు 7 గంటల పైన భజన చేయడానికి సమయం కల్పించడం జరిగింది. వైకుంఠ ఏకాదశి శుభ సందర్భంగా, వైకుంఠ ద్వారం ద్వారా దర్శనంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. భజన సంకీర్తనల వల్ల భక్తి భావం పెరిగి మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఇందులో భజన మండలి భక్తులు మాందాడి రాజు, తడక సదానందం గౌడ్, తడక రవి, కుసుమ రమేష్, గజ్జి మహేందర్, వైద్యుల ప్రభాకర్, పింగిళి సాంబరెడ్డి, అంబాల మల్లయ్య, వైద్యుల రాంరెడ్డి రెడ్డి, తుడుం, కుమారస్వామి, నాలికె శంకర్, మందాడి చంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు తగు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు దేశగాని కృష్ణ, అమ్రూ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమ కారులను (2001- 2014) వరకు ఉద్యమించిన ఉద్యమకారులను గుర్తించి ప్రతి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో బైండోవర్ కేసులు, ఇంటలిజెన్స్ ఆనాటి దినపత్రికల్లో వచ్చిన వార్త కథనాల ఆధారంగా చేసుకొని ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, సంక్షేమ పథకాలను అందజేసి ఆర్థికంగా నష్టపోయిన మాకు తగు న్యాయం చేయాలనీ కోరారు. ఈ విషయమై డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ తగిన చొరవ తీసుకొని ఈ ప్రాంత ఉద్యమకారులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అల్వాల శీను, రత్నాకర్ రెడ్డి, ఎండీ అప్సర్, బోడపట్ల వెంకన్న, గంధసిరి వేణు, చిత్తారి సోమన్న, మానుపాటి సమ్మయ్య, బోడ సురేష్, బల్లెం అప్పయ్య, జంపాల శీను, లింగాల మహేష్, బోడపట్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు సాయం



**వరంగల్ వాయిస్, మడికొండ :** మడికొండ గ్రామంలో నిరుపేద వృద్ధులు , వితంతువులు , ఒంటరి మహిళలకు కూనిశెట్టి సుబ్బారావు ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కుమారుడు లక్ష్మీ, సునీల్(ఎన్నారై యుఎస్ఏ) 10కిలోల సన్న బియ్యంతో పాటు పలు రకాల నిత్యావసర సరుకులు వెయ్యి రూపాయల విలువచేసే వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెసు నాయకులు పెళ్లి కృష్ణమూర్తి , అరే రమేష్, గుడిపాటి పరమేష్, అంకం సురేష్, సతీష్‌యాదవ్, అనిల్, పరకాల రోహిత్ పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీకి పునర్ వైభవం తెస్తాం



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రజా సమస్యలపై పోరాడడం ద్వారా భాద్యతాయితమైన, ప్రతిపక్షంగా పని చేయడం ద్వారా తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పునర్వైభవం తీసుకొస్తామని ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు, కుడా మాజీ చైర్మన్ గట్టు ప్రసాద్ బాబు అన్నారు. పరకాలలో ఏర్పాటు చేసిన పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గం ఇంచార్జి కందుకూరి నరేష్, భూపాలపల్లి ఇంచార్జి మొక్కిరాల జనార్ధన్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గట్టు ప్రసాద్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కావున ఇచ్చిన హామీలు అమలు, పరిపాలన తీరుపై కొంత సమయం ఇచ్చి స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో ఇచ్చిన హామీలు అమలు విషయంలో గానీ, పరిపాలన విషయంలో గానీ ఏమైనా లోపం జరిగితే ప్రజల తరుపున నిలబడి బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నిలబడాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ పైన ఉందని తెలిపారు. సాగునీరు, కరెంటు లాంటి ఎన్నో సమస్యలు ఉన్నాయని, వీటన్నిటి విషయంలో ప్రజల తరఫున నిలబడతామని, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని దిశా నిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.ఎల్ శ్రీధర్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగవెల్లి సురేష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు ఎలుగు వెంకటేశ్వర్లు, పార్లమెంట్ నాయకులు కందుకూరు చంద్రమోహన్, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, వరంగల్ పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి మాచర్ల నగేష్, భూపాలపల్లి జిల్లా నాయకులు మేకల సుధాకర్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గంగాధర వీరాంజనేయులు, సాగంటి ప్రకాష్, మూర్తి, రేవూరి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులపై ఆందోళన చెందవద్దు




**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం అందించనున్న ఐదు గ్యారెంటీ పథకాల అమలు కోసం చేపడుతున్న ప్రజా పాలన గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి దరఖాస్తు ఫారాలు అందజేస్తామని సర్పంచ్ కందగట్ల రవి అన్నారు. శాయంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ రవి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఇంటికి ఒక దరఖాస్తు ఫారాన్ని అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, జీపీ సిబ్బందితో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ని కుటుంబాలు ఉంటే అందరికీ ఫారాలు అందజేయడానికి మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ తో మాట్లాడానని, అతి త్వరలో అందరికీ దరఖాస్తు ఫారాలు అందజేస్తామని తెలిపారు. దరఖాస్తు ఫారాలు సమర్పించడానికి జనవరి 6 సాయంత్రం 5 గంటలలోపు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు దరఖాస్తు ఫారాల కోసం ఆందోళన చెందవద్దని, జిరాక్స్ సెంటర్ల వద్ద కొనుగోలు చేయవద్దని సూచించారు. అతి త్వరలో అందరికీ దరఖాస్తు ఫారాలు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ




**వరంగల్ వాయిస్, మడికొండ :** 46వ డివిజన్ మడికొండ ఎస్సీ మహిళా కమిటీ హాల్ లో శుక్రవారం ప్రజా పాలన అభయ హస్తం గ్యారెంటీల దరఖాస్తులను మాజీ కార్పొరేటర్ తొట్లరాజు యాదవ్, 46వ డివిజన్ కాంటెస్ట్ కార్పోరేటర్ వస్కుల శంకర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, పల్లె గోపి, అధికారులు, వివోలు, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోడ డిన్నా జన్మదిన వేడుకల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హరిత కాకతీయ హెూటల్ లో జరిగిన మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా జన్మదిన వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరై శు భాకాంక్షలు తెలియజేశారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ స్కీమ్ లను అమలు చేస్తామని వాగ్ధానం చేసిన నేపథ్యంలో ప్రజా పాలన పేరుతో లబ్ధిదారుల నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని హనుమకొండ 6వ డివిజన్ లో కుమారపల్లి మార్కెట్ వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని శుక్రవారం వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పరభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వమని, వారి ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వమని, గతంలో మాదిరిగా ఇష్టారాజ్య పరిపాలన కుదరదని, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. అధికార యంత్రాంగమంతా సమన్వయంతో పని చేసి సహకరించాలని కోరారు. ప్రజలకు ఏ ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రతి సమస్యపై స్పందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అగర్దిది శివాజీ, జిల్లా ఓబీసీ డిపార్టుమెంటు చైర్మన్ బొమ్మతి విక్రం, ఏదులాపురం లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నల్ల సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో గౌరవం-ముందడుగు సాధ్యం

### డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విద్యతోనే సమాజంలో గౌరవం-ముందడుగు సాధ్యమని, శాస్త్రీయ ప్రణాళిక -పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చునని, విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని డాక్టర్ అశోక్ పరికిపండ్ల అన్నారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరు చుకోవాలని సూచించారు. శుక్రవారం సీరోలు మండలం లోని కాంపెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సీనియర్ వైద్యులు డా.రాపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించుటకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్ట్ సంఘం సహకారంతో నిర్వహించనున్నామని, విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు చదువుకునే పద్ధతులు జ్ఞాపకశక్తి మెలకువలు టెన్షన్ అధిగమించే మార్గాలను సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం శ్రీలత, శంకర్, విష్ణు, సీఆర్ పీ ప్రవీణ్ లతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పాలన కొనసాగిస్తాం

### ఎంపీపీ పంతకాని సమ్మయ్య




**వరంగల్ వాయిస్, కాటారం:** ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ద్వారా ప్రజా పాలన కొనసాగిస్తామని కాటారం మండల పరిషత్ అధ్యక్షుడు పంతకాని సమ్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని శంకరంపల్లి, విలాసాగర్ తదితర గ్రామాలలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా దీర్ఘకాలిక ప్రయోజనాలతో అభివృద్ధి, సంక్షేమం చేపట్టనున్నట్లు సమ్మయ్య తెలిపారు. ఆయా కార్యక్రమాలలో కాటారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాలోతు శంకర్ , శంకరంపల్లి సర్పంచ్ అంగజాల అశోక్ కుమార్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏపీఎం లవకుమార్, పంచాయతి సెక్రటరీ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొనగా మండల ప్రత్యేక అధికారి సంజీవరావు పర్యవేక్షించారు.

## ప్రజా పాలన దరఖాస్తులను పరిశీలించిన వైస్ ఎంపీపీ




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కొమ్మనపల్లి తండాలో శుక్రవారం ప్రజా పాలన దరఖాస్తులను తొర్రూరు వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్ లు, ఎంపీడీవో సింగారపు కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు కలిగిన ప్రజాపాలన దరఖాస్తులను అర్హులైన లబ్ధిదారులు వినియోగించుకోవాలని ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో కాకుండా పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన ఉన్నటువంటి ప్రభుత్వాన్ని అన్నారు. ప్రభుత్వం అంటే కేవలం తమ స్వాప్రయోజనాల కోసం అధికారంలోకి వచ్చి తమ సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకునేది ప్రభుత్వం కాదని, అలాంటి వ్యవస్థను రూపుమాపి ప్రజావ్యవస్థను తీసుకువచ్చినది కాంగ్రెస్ పార్టీ అని మరోసారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మనపల్లి తండా సర్పంచ్ రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మారపు మహేందర్, బాలాజీ నాయక్, మెగ్య నాయక్, బిచ్యా నాయక్, రమేష్ నాయక్, ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

## మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గంలోని 12వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంచోజు శివ ప్రమాదవశాత్తు మరణించగా శుక్రవారం వారి కుటుంబానికి అండగా రెండు లక్షల రూపాయల గులాబీ పార్టీ ఇన్సూరెన్స్ చెక్‌ను శివనగర్‌లోని వారి నివాసంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శివ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా తోడుగా ఉంటుందన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గులాబీ జెండా మోసే ఏ కార్యకర్తను పార్టీ వదులుకోదని, అలాంటి నిఖార్సుగా పని చేసే కార్యకర్తలు ఏదైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.2లక్షలు అందించి ఆదుకుంటున్నామని



మాజీ ఎమ్మెల్యే నన్నపునేని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత రాజు యాదవ్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనను సద్వినియోగించుకోవాలి




**వరంగల్ వాయిస్, నడికూడ :** నేడు ప్రజా పాలన దరఖాస్తు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మండల తహసీల్దార్ జి నాగరాజు రామకృష్ణాపురం, ధర్మారం గ్రామాలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ప్రజా పాలన కార్యక్రమంలో ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు . గృహజ్యోతి చేయూత ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, రైతులు మరియు రైతు కూలీలు అందరూ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ఆఫీసర్లు మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ లావుడియా హేమా నాయక్, మండల పంచాయత్ ఆఫీసర్ ఎండీ అఫ్జల్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె శ్రీదేవి, ఏఎస్ఓ సునీత, ఐకేపీ సీసీలు రాజు, కుమార్ స్వామి , ఏఈఓ పవన్, పంచాయతీ సెక్రటరీలు అంజలి, బిక్షపతి, లైన్ ఇన్ స్పెక్టర్ సదానందం, ఏఎన్ఎం కరుణ, రెవిన్యూ సిబ్బంది మహేష్, రాజు, ఈశ్వరి, రాణి, ఆరోగ్యం, ప్రభాకర్, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన నిరంతర ప్రక్రియ

## వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో అభయ హస్తం గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణ ప్రజా పాలన కార్యక్రమాన్ని వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి వారికి అన్ని విధాలుగా సలహాలు సూచనలు ఇస్తూ దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అవసరమైతే ఇంకా కొన్ని రోజులు పెంచుకుందామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి, గ్రామ పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల అధ్యక్షుడు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, నాయకులు, వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్



**వరంగల్ వాయిస్, వెంకటాపురం :** మండలంలోని చాతరాజు పల్లి గ్రామ డ్యాగల భద్రయ్య రైస్ మిల్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై రైస్ మిల్లును రిబ్బన్ కట్ చేసి, టెంకాయ కొట్టి ప్రారభించారు. గణపురం మండలం వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, బుద్ధారం గ్రామ సర్పంచ్ గండ్ర ఆగమ రావు, ఉప సర్పంచ్ మల్లవెన రవి, మండల సీనియర్ నాయకులు సంపత్ రావు, మాల భద్రయ్య, వంగపల్లి భాస్కర్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దు

## కాంగ్రెస్ నేత శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో భాగంగా అభయ హస్తం ద్వారా ప్రజలందరూ వారి కుటుంబ వివరాలు సంబంధిత కేంద్రాలలో సమర్పించాలని కొరారు. శుక్రవారం వరంగల్ శివనగర్ లో అభయహస్తం పత్రాలను పలువురికి పంపిణీ చేశారు. ప్రజలు జనవరి 6 వరకు వివరాలు సమర్పించవచ్చని, అన్ని వివరాలు నమోదు చేయించి సరిచేసుకొని గ్యారంటీ పత్రం సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శామంతుల శ్రీనివాస్ తో పాటు డివిజన్ నాయకులు విజయ రాంచందర్, పట్టూరి సుధాకర్, అంకం సత్యం, నూనె రవి, కిరణ్, వెంకట్, మధు, శ్రీధర్, సదానందం,రాజు తదితరులు పాల్గొన్నారు.

# మేము పాలకులం కాదు సేవకులం

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రజాపాలనలోనే బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని, అభివృద్ధి సంక్షేమం అందుతాయని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని అభయహస్తం దరఖాస్తులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తూటి పావని రమేష్, మండల అద్యక్షుడు గోపాల్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప సర్పంచి వీరన్న నాయక్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇది ప్రజా సర్కార్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజల సర్కార్ అధికారంలోకి వచ్చిందని, అందుకే ప్రజాపాలన పేరుతో ప్రజల దగ్గరికి వెళ్లి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రనాయక్ అన్నారు. శుక్రవారం కురవి మండలంలోని మన్నెగూడెం, డోర్నకల్ మండలంలోని రావిగూడెం, బొడ్రాయి తండా గ్రామాల్లో ఆయన పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దళారులను డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే అన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తేవాలని చెప్పారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ప్రతి దరఖాస్తు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చలపతి రావు, ఎమ్మార్వో నాగ భవానీ, ఎంపీఓ మున్వర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యవతిని ఓదార్చిన మాజీ మంత్రి హరీష్ రావు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోదరుడు గుగులోత్ కిషన్ నాయక్ ఇటీవల స్వర్గస్థులవగా నేడు కురవి మండల పెద్ద తండాలోని సత్యవతి స్వగృహంలో కిషన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, మానుకోట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, మాజీ మంత్రి దయాకర్, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, శంకర్ నాయక్ తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విచ్చేసి కిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 20వ డివిజన్‌లో దరఖాస్తుల స్వీకరణ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ లో శక్రవారం తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ కార్తీక్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుసుమ సతీష్, సీనియర్ నాయకుడు చిమ్మని వేణు, దేవనూరి రవీందర్, కూరాకుల చంద్రశేఖర్, జన్ను వేణు, మక్బూల్, పరిగి శివప్రసాద్, ఆర్పీలు కవిత, రేణుక, సునీత, పోలీస్ సిబ్బంది శ్రీలత, శ్రీధర్ పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్క పల్లి గ్రామానికి చెందిన ఇటికాల రాధా బాబురావుల ఏకైక పుత్రిక సాయి శ్రీ అఖిల్ రావుల వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను మాజీ తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు తెలంగాణ బీసీ సంఘం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం అధ్యక్షుడు నాగుర్ల సంతోష్ రావు, నాయకులు నాగుర్ల రాజేశ్వరరావు, శ్రీనివాస్ రావు నర్సింగా రావు, స్థానిక ఎంపీటీసీ రూపా దేవేందర్, సురావు శివరావు, మోర్తాల దేవేందర్, లోనే రాజు, కౌడగాని శ్రీనివాస్,డ సురావు రాజయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# దర్శకుడిని మార్చేశారు

## ఆవేదనతో లేఖ రాసిన నవీన్ మేడారం

బింబిసార లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత నందమూరి కల్యాణ్‌రామ్ నుంచి వస్తున్న తాజా చిత్రం డెవిల్. ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నాడు. డిసెంబర్ 29న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాకు మొదట నవీన్ మేడారం దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. అనూహ్యంగా అతడి పేరును తీసేసి ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్న అభిషేక్ నామా పేరు దర్శకుడిగా పోస్టర్‌లో ఉంది. ఇక విడుదలకు ఇంకా రెండు రోజులు ఉంది అనగా.. ఈ వివాదంపై తాజాగా నవీన్ మేడారం ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. డెవిల్ సినిమాకు ప్రాణం పోసేందుకు నేను మూడేళ్లకు పైగా కష్టపడ్డాను. మొదట కాన్సెప్ట్ ఆ తర్వాత స్క్రిప్ట్, కాస్ట్యూమ్స్ ఎంపిక చేసుకోవడం, లొకేషన్స్, సెట్స్ ఇలా ప్రతి అంశంలో నా ప్రమేయం ఉంది. డెవిల్ చిత్రాన్ని మొత్తం నేను 105 రోజుల పాటు వైజాగ్, కరైకుడి, హైదరాబాద్ లాంటి లొకేషన్స్ లో చిత్రీకరించాను. కేవలం చిన్న ప్యాచ్ వర్క్ మాత్రం నేను చేయలేదు. డెవిల్ పూర్తిగా నా క్రియేషన్. నాకు ఇది కేవలం ప్రాజెక్ట్ కాదు, ఇది నా బిడ్డ, ఎవరు ఏమి చెప్పినా, ఇది నవీన్ మేడారం సినిమా. ఇప్పుడు చెబుతున్నా డెవిల్ చిత్రం తెరకెక్కించే సమయంలో నేను ఎలాంటి తప్పు చేయలేదు. ఈ సినిమా కోసం నాకు అండగా నిలిచిన కళ్యాణ్‌రామ్ సార్‌కి, ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు. 'డెవిల్' బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం నాకు ఉంది, డిసెంబర్ 29, 2023న అందరూ థియేటర్లలో సినిమాను చూడాలని కోరుతున్నాను.






# సరిపోదా శనివారంలో
# కొత్త లుక్‌లో నాని

హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ రెండో సారి కలసి పని చేస్తున్న 'సరిపోదా శనివారం' చిత్రం తాజా షెడ్యూల్ బుధవారం మొదలైంది. ఈ చిత్రంలో నాని పూర్తి స్థాయి యాక్షన్ పాత్ర పోషిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'గత నెలలో ఒక షెడ్యూల్ పూర్తి చేశాం. బుధవారం నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభించాం. లెంగ్తీ షెడ్యూల్ ఇది. యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కొంత టాకీ పార్ట్ కూడా చిత్రీకరిస్తాం. ఈ సినిమాలో నాని రగ్గడ్ లుక్‌లో కనిపించి, అందరినీ అలరిస్తారు' అని నిర్మాతలు చెప్పారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, మురళీ జి సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.




# చిరంజీవే నా స్ఫూర్తిప్రదాత

కలియుగ పాండవులు సినిమాతో దగ్గుబాటి ఫ్యామిలీ నుంచి హీరోగా సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు వెంకటేశ్ . కామెడీ, ఫ్యామిలీ, యాక్షన్.. ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో కూడిన సినిమాలతో వినోదాన్ని అందించడం వెంకీ స్పెషాలిటీ. తన యాక్టింగ్‌తో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న వెంకటేశ్ ప్రస్తుతం వెంకీ 75 సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. తాజాగా వెంకీ మామ సినిమాటిక్ జర్నీ సెలబ్రేషన్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా వెంకీ మాట్లాడిన మాటలు అందరిలో జోష్ నింపాయి. చిరంజీవి ఇక్కడ లేకుంటే నేను సినిమాల నుంచి తప్పుకొని ఇప్పటికే హిమాలయాలకు వెళ్లేవాడినంటూ చెప్పుకొచ్చాడు వెంకటేశ్. చిరంజీవి సుమార్ 9 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఖైదీ నం 150 సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టడం చూసి.. నా అభిమానులకు వినోదాన్ని పంచడం కొనసాగించాలని ఫిక్స్ అయ్యా. అప్పుడే ఖచ్చితంగా యాక్టింగ్ కొనసాగించాలని అనుకున్నా. యాక్టింగ్ ఇక ఆపను అంటూ వెంకీ మామ నుంచి ఆసక్తికర కామెంట్స్ వచ్చేసరికి ఆడిటోరియం అంతా అరుపులు, విజిల్స్, ప్రశంసలతో హోరెత్తిపోయింది. వెంకటేశ్ కాంపౌండ్ నుంచి యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న సైంధవ్ చిత్రానికి హిట్ ఫేం శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నాడు. సైంధవ్ జనవరి 13న సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. చంద్రప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్ మిషన్ నేపథ్యంలో సాగుతున్న ఈ చిత్రంలో జెర్సీ ఫేం శ్రద్దా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# చిరుధాన్యాలతో ఆరోగ్య వంటకాలు

**రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్**

**పిండి వంటల తయారీలోను ఉచిత శిక్షణ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చిరుధాన్యాలతో ఆరోగ్య వంటకాలే కాకుండా వచ్చే సంక్రాంతికి అత్యంత పోషక విలువలు కలిగిన పిండి వంటల కూడా తయారు చేసుకోవచ్చని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్ తెలిపారు. చిరుధాన్యాలతో తయారు చేసిన పిండివంటలు రోగ నిరోధక శక్తిని పెంచి మనం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. మహిళలకు చిరుధాన్యాల వంటకాలు, పిండి వంటల తయారీపై శుక్రవారం భట్టుపల్లి గ్రామంలోని బొడ్రాయి వద్ద మహిళలకు ఒక రోజు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడమే లక్ష్యంగా గత కొంత కాలంగా ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కుసుమ సురేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా మిల్లెట్ కుకింగ్ లో ప్రావీణ్యం పొందిన కుసుమ కవిత అనేక వంటకాల తయారీ విధానాన్ని వివరించడంతోపాటు వారి ముందే రాగి మురుకులు, జొన్న మురుకులు, కొర్ర దోశ , రాగి దోశ, కరివేపాకు కొర్ర పులిహోర మొదలగు వంటకాలను చేసి మహిళలకు చూపించారు. బిజీ జీవితంలో ప్రజలు తీసుకొనే ఆహారంపై అప్రమత్తత అవసరమన్నారు. మిల్లెట్స్ ను ప్రతీ ఒక్కరు తమ ఆహారంలో భాగంగా చేసుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని మిల్లెట్స్ ప్రమోటర్ సంస్థ గౌరవ సలహాదారులు నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, మౌనిక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ

**అభినందించిన జిల్లా పాత్రికేయులు**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీ య ూ డ బ ్ల ్య ూ జే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బషీర్ భాగ్ లోని సంఘం ప్రధాన కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. నామినేషన్ల గడువు పూర్తయ్యేవరకు కేవలం విరహత్ అలీ నామినేషన్ ఒక్కటే రావడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ ఎన్నిక కావడంతో జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డితోపాటు జాతీయ నాయకులు అభినందనలు తెలిపారు. అదేవిధంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, సీనియర్ జర్నలిస్ట్, ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు సాయిరాం, వరంగల్ జిల్లా నాయకులు శ్రీరామ్ రామచందర్, మట్ట దుర్గాప్రసాద్, మిద్దెల రంగనాథ్, గాడిపెల్లి మధు, ఎం.రజనీకాంత్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### విజేతకు బహుమతి ప్రదానం..

వరంగల్ లో జరిగిన టోర్నమెంటులో 50 ప్లస్ మెన్ సింగిల్స్ షటిల్ పోటీలో రన్నర్ గా నిలిచిన డాక్టర్ జి.రవికుమార్ ను రాకేష్ రెడ్డి, కోచ్ కూరపాటి రమేష్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశమూర్తి అభినందించారు.

### వ్యాపార వేత్తకు జన్మదిన శుభాకాంక్షలు..

తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త, సుప్రభా హెూటల్ చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్ గుండు ప్రభాకర్ జన్మదినం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సదయ్య, పూర్వ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షులు సాయిరాం కలిసి పూలబొకే ఇచ్చి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

# 4లోగా ఎన్నికల వ్యయ ముసాయిదా ఇవ్వాలి

**లేకుంటే చట్టపరమైన చర్యలు**

**జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాహుల్ గావాండే**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల వ్యయ ముసాయిదాను వచ్చే నెల 4వ తేదీ లోగా సమర్పించే విధంగా జిల్లా వ్యయ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాహుల్ పంజాబ్రావు గావాండే ఆదేశించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆధ్వర్యంలో పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంట్ టీంతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో ఎంతమంది అభ్యర్థులు పోటీ చేశారు, ఎంత మంది ఎన్నికల వ్యయ ముసాయిదాను సమర్పించారంటూ జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరకాల నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు పోటీ చేయగా 26 మంది తమ ఎన్నికల వ్యయ వివరాలను అందజేశారని, మరో ఇద్దరు అభ్యర్థుల నుంచి వివరాలు రావాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఇందులో 12 మంది అభ్యర్థులు ఎన్నికల వ్యయ వివరాలను సమర్పించినట్లు తెలిపారు. అయితే అభ్యర్థులు సమర్పించిన వ్యయ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సమర్పించిన ఎన్నికల వ్యయ ముసాయిదాలో ఏవైనా వివరాలు సమగ్రంగా లేకపోతే వారికి నోటీసు జారీ చేసి సరైన వివరాలను తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల నాలుగో తేదీలోగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యయ వివరాలను సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల వ్యయ నోడల్ అధికారి, జిల్లా సహకార శాఖ అధికారి జి.నాగేశ్వర్ రావు, సహాయ వ్యయ పరిశీలకులు, నోడల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు రూ.25వేల పింఛన్ ఇవ్వాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలంతోపాటు ప్రతి నెల రూ.25 వేల పింఛన్ అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి కోరారు. శుక్రవారం ఉర్సులో మరుపల్ల రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులు అందించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజా పాలనలో ప్రతి ఉద్యమకారులు తమ వద్ద ఉన్న ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్గొన్న విధంగా ప్రజాపాలన దరఖాస్తులో పెన్షన్ కాలం చేర్చకపోవడంతో అయోమయం తప్పడంలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగానే ఉద్యమ కారులను ఆదుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కో కన్వీనర్ ఎలగం సత్యనారాయణ, శేంకేశి లింగమూర్తి, దిండిగల సోమేశ్వర్, మెంతుల యాదగిరి, కోడూరు నరేష్, మోక్ష సోమ మధుకర్, బొమ్మగాని కుమార స్వామి, రాజ్ కుమార్, సురేందర్, కన్నబోయిన రేణుక, ముసికే ప్రమీలా దేవి, గొలనుకొండ ఉపేంద్ర, పప్పుల మంజుల, కొడిపాక రమాదేవి, అవునూరి లక్ష్మి, పల్లకొండ యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## చింతల్ బస్తీలో..

# శ్రీరాములోరి అక్షింతల శోభాయాత్ర

అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముల వారి అక్షింతల శోభాయాత్ర చింతల్ బస్తీలో కన్నుల పండువగా సాగింది. చింతల్ కట్ట మైసమ్మ తల్లి గుడి ప్రాంగణం నుంచి శ్రీ రామ భక్తులు, మహిళలు, పెద్దలు, పిల్లలు, మేళతాళాలతో, కొలాటాలతో, భజన సంకీర్తనలతో శ్రీ భక్త హనుమాన్ దేవాలయానికి తీసుకెళ్ళారు. వితరణ కార్యక్రమాన్ని జనవరి 1 నుంచి 15 తేదీ వరకు శ్రీరాముని అక్షింతలు, శ్రీరాముని ఫొటో, అయోధ్య తీర్థ క్షేత్ర వారి ఆహ్వాన పత్రికను ప్రతి ఇంటికి అదించనున్నారు.

**- వరంగల్ వాయిస్, కరీమాబాద్**

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com